# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 02 శనివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 105

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ప్రేయసిని 20 ముక్కలు చేసాడు

### పోలంలో పాతిపెట్టాడు



భద్రాద్రి కొత్తగూడెం :ప్రియురాలిని ప్రియుడు 20 ముక్కలుగా నరికి గోనె బస్తాలో పెట్టి పొలంలో పూడ్చి పెట్టిన వైనం ఇది. జూలూరుపాడు మండలం మాచినేనిపేటలో ప్రియురాలు స్వాతిని ప్రియుడు వీరభద్రం మూడు రోజుల క్రితం చంపి గోనె బస్తాలో పెట్టి పొలంలో పూడ్చి పెట్టారు. వీరిద్దరూ గతంతో సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామని.. ఓ జంట దగ్గర నుండి రూ. 16 లక్షలు తీసుకున్నారు.

ఉద్యోగం రాకపోవడంతో, మోసపోయమని బాధితులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ 16 లక్షల విషయంలో స్వాతి- వీరభద్రంకు మధ్య విబేధాలు ఏర్పడ్డాయి. దీంతో స్వాతిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని దారుణంగా హత్య చేసాడు వీరభద్రం.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు



**హైదరాబాద్** : క్వింటాల్‌కు రూ. 500 ఇస్తానన్న సీఎం రేవంత్ బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే లేడని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలైందని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతేడాది నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీళ్లు రావడం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. సాగు పెరిగిన కారణంగా నల్గొండ జిల్లాలో ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంచనా వేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేసే పరిస్థితి నల్గొండ జిల్లాలో లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలయిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేక, గన్నీ బస్తాలు అందించలేక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు రూ .1800లకు క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేను అడుగుతున్నాను ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసి రైతులకు 500 బోనస్, 15000 రైతుబంధు ఇస్తానని చెప్పి మాట తప్పవా లేదా? రైతుల వడ్ల లోడ్ ఎత్తమంటే మహారాష్ట్రకు నోట్లో కట్టల లోడ్ ఎత్తుతున్నాడు ముఖ్యమంత్రి. నల్గొండ జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, రూ. 200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటే అందులో రూ. 50 కోట్లు మాత్రమే చెల్లించారు.



## దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం

# చెల్లదు

- జడ్జిలా వ్యవహరించే అధికారం లేదు
- ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది
- నిందితులు అయినంత మాత్రాన ఇళ్లు కూల్చేస్తారా
- రాష్ట్రాల బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆగ్రహం
- చర్యలు తీసుకునే అధికారులపై పెనాల్టీ
- ఆక్రమణదారులకు తీర్పు వర్తించదు
- సుప్రీం ధర్మాసనం కీలక తీర్పు...

షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపు నిచ్చింది.



## ఇక ప్రాంతీయ భాషల్లోనూ

# వైద్యవిద్య

- దేశీయంగా మరో 75వేల మెడికల్ సీట్ల పెంపు
- పేదలకు ఆరోగ్యం చేరువ చేయాలన్న లక్ష్యం
- దర్భంగా ఎయిమ్స్ శంకుస్థాపనలో ప్రధాని మోడీ



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు

- వారం రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం
- బోనస్ మాట దేవుడెరుగు.. కొనే నాథుడే లేడు : మాజీ మంత్రి హరీశ్‌రావు

## అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన

## లగచర్లలో అధికారుల బృందంపై దాడి ఉదంతం..



హైదరాబాద్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై జరిగిన దాడి కేసు రాజకీయ మలుపు తిరిగింది. దాడికి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, భారాస నేత పట్నం నరేందర్‌రెడ్డిని సూత్రధారిగా పేర్కొన్న పోలీసులు ఆయన్ని అరెస్టు చేసి, జైలుకు తరలించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇచ్చిన ఆదేశాలతోనే... నరేందర్‌రెడ్డి కుట్రకు వ్యూహరచన చేశారని, తన అనుచరుడు బోగమోని సురేశ్‌ను వినియోగించుకొని మిగిలిన నిందితులను రెచ్చగొట్టినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఇంటి వద్ద పట్నం నరేందర్‌రెడ్డిని బుధవారం ఉదయం 7.02 గంటలకు అరెస్ట్ చేశారు. అనంతరం 9.30 గంటల సమయంలో పరిగిలోని సీఐ కార్యాలయంలోని క్యాంపునకు తరలించారు. అక్కడ హైదరాబాద్ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం మధ్యాహ్నం 1:40 గంటల వరకు విచారించింది. ఈ కేసులో మంగళవారం 16 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు... బుధవారం పట్నం నరేందర్‌రెడ్డితోపాటు బోగిమోని మహేష్, బేగరి విశాల్, నీరేటి సాయిలు, నీరేటి రమేష్‌లను అరెస్టు చేశారు. వీరందరికీ కొడంగల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పరిగి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నరేందర్‌రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని కొడంగల్ కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

సురేశ్‌తో 84సార్లు సంభాషణ

విచారణ క్రమంలో కేటీఆర్ పాత్ర గురించి నరేందర్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు తమ రిమాండ్ నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న కేటీఆర్ ఆదేశాల మేరకే సురేశ్‌ను పురమాయించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నరేందర్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను పోలీసులు జప్తు చేశారు. అందులోని కాల్‌డేటా రికార్డర్(సీడీఆర్)ను సమగ్రంగా విశ్లేషించేందుకు న్యాయస్థానం అనుమతి కోరారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి దాడి జరిగిన రోజు వరకు సురేశ్‌కు నరేందర్‌రెడ్డికి మధ్య 84 ఫోన్‌కాల్స్ సంభాషణల్ని గుర్తించారు. ఈ నెల 2-9 తేదీల మధ్య అత్యధికంగా 34 కాల్స్ ఉన్నాయని, దాడి జరిగిన రోజు మాత్రం ఒకసారే సంభాషణ జరిగినట్లు తేల్చారు.

వనరులు సమకూర్చారని ఆరోపణ

కలెక్టర్ బృందంపై దాడి కుట్రకు వ్యూహరచనలో నరేందర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని, అందుకు అవసరమైన ఆర్థికవనరులతోపాటు నైతిక మద్దతును ఆయనే సమకూర్చారని రిమాండ్ నివేదికలో పోలీసులు ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనేది ఈ కుట్ర వెనక ఉద్దేశంగా పేర్కొన్నారు.

> వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై జరిగిన దాడి కేసు రాజకీయ మలుపు తిరిగింది. దాడికి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, భారాస నేత పట్నం నరేందర్‌రెడ్డిని సూత్రధారిగా పేర్కొన్న పోలీసులు ఆయన్ని అరెస్టు చేసి, జైలుకు తరలించారు.

## కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికికే

# ఢిల్లీకి వెళ్లా

- కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలైంది
- రైతుల సమస్య కూడా పరిష్కరించని సంస్కారం కాంగ్రెస్‌ది
- 9 నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నా సీఎంకు కలిసే తీరిక లేదా..?
- తెలంగాణ భవన్ ప్రెస్‌మీట్‌లో
- మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: నేను ఢిల్లీకి వెళ్లింది అనుముల కుటుంబ కుంభకోణాలు బయటపెట్టేందుకు వెళ్లానని, మళ్లీ కూడా కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అంశం, రాష్ట్రంలో భూసేకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దురాగతాలపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఢిల్లీకి వెళితే బీజేపీతో కాళ్ల బేరానికి వెళ్లినట్లా..? మరీ బీజేపీకే చెందిన గవర్నర్‌ను రేవంత్ రెడ్డి కలిస్తే అది కాళ్ల బేరానికి వెళ్లినట్లు కాదా..? అదానీ కాళ్లు పట్టుకొని

మిగతా 2లో

# దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు

## ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్యవిద్య

పాట్నా: త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటు లోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. దేశీయ భాషల్లో వైద్యవిద్య వల్ల సామాన్యులకు అందుబాటులోకి రావడమే గాకుండా, వైద్య సేవల్లో నాణ్యత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. దర్భంగా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధాని మోదీ ఎయిమ్స్ దర్భంగాను ప్రారంభించారు. 1260 కోట్ల రూపాయలతో భాగల్‌పూర్ ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. ఆరోగ్య రంగంలో

ప్రధానంగా ఐదు అంశాలపై మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదలకు మంచి ఆరోగ్య సౌకర్యాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ప్రధాన మంత్రి అన్నారు. దర్భంగా ఎయిమ్స్ బీహార్ ఆరోగ్య రంగంలో భారీ మార్పు తీసుకువస్తుందని ఆయన అన్నారు. దేశప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, వారి జీవితాలను సులభతరం చేయడం మా ప్రధాన కర్తవ్యమని ప్రధాని మోదీ అన్నారు. దర్భంగా ఎయిమ్స్ నిర్మాణంతో మిథిలా, కోసి, తిర్హట్ ప్రాంతాలతో పాటు, పశ్చిమ బెంగాల్, అనేక పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సౌకర్యాలు ఉంటాయి. పొరుగు దేశం నేపాల్ నుండి వచ్చే రోగులు కూడా ఈ ఆసుపత్రిలో చికిత్స పొందగలరు. దేశంలో ఆరోగ్యానికి సంబంధించి మా ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మా మొదటి దృష్టి వ్యాధి నివారణపై ఉంది. వ్యాధిని సక్రమంగా నిర్ధారించడంపై రెండో దృష్టి. ప్రజలకు ఉచితంగా, చౌకగా వైద్యం అందించడం, వారికి తక్కువ ధరకే మందులు అందజేయడం, వైద్యుల కొరతను అధిగమించడం, చిన్న పట్టణాల్లోనూ అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించడం నాల్గవ లక్ష్యం. దేశంలో ఐదవ దృష్టి ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తరించడం ముఖ్యమని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలోని పేదల జీవితాల్లో పెనుమార్పు తెస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పథకం కింద దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది చికిత్స పొందారు. ఆయుష్మాన్ భారత్ పథకం లేకుంటే వీరిలో ఎక్కువ మంది ఆసుపత్రిలో చేరి ఉండేవారు కాదు. ఆయుష్మాన్ యోజన ద్వారా కోట్ల కుటుంబాలు దాదాపు రూ.1.25 లక్షల కోట్లు ఆదా చేశాయని అన్నారు. బిహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయి.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారులపాలు

**హైదరాబాద్ :** క్వింటాల్‌కు రూ. 500 ఇస్తానన్న సీఎం రేవంత్ బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే లేడని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలైందని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతేడాది నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఈ సంవత్సరం కృష్ణా నదిలో పుష్కలంగా నీళ్లు రావడం వల్ల ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. సాగు పెరిగిన కారణంగా నల్గొండ జిల్లాలో ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంచనా వేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేసే పరిస్థితి నల్గొండ జిల్లాలో లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం దళారుల పాలయిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేక, గన్నీ బస్తాలు అందించలేక రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు రూ .1800లకు క్వింటాల్ చొప్పున దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేను అడుగుతున్నాను ఎన్నికల ముందు బాండ్ పేపర్ రాసి రైతులకు 500 బోనస్, 15000 రైతుబంధు ఇస్తానని చెప్పి మాట తప్పవా లేదా? రైతుల వడ్ల లోడ్ ఎత్తమంటే మహారాష్ట్రకు నోట్ల కట్టల లోడ్ ఎత్తుతున్నాడు ముఖ్యమంత్రి. నల్గొండ జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, రూ. 200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటే అందులో రూ. 50 కోట్లు మాత్రమే చెల్లించారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని హరీశ్‌రావు తెలిపారు. వడ్లకు మద్దతుధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేసిన పరిస్థితి. కొన్న వడ్లకు కూడా విపరీతంగా తరుగు పెట్టి రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. నిన్న జగిత్యాల జిల్లా పర్యటనలో అక్కడి రైతులని అడిగితే ఒక కిలో సన్నవడ్లు కూడా కొనలేదని చెప్పారు. ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో కూడా ఒక కిలో సన్న వడ్లను కొనలేదు. సన్న వడ్లను కొనే వ్యవస్థ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆందోళన

వికారాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. నరేందర్ రెడ్డి వెంటనే విడుదల చేయాలని కోస్గిలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తప్పుడు కేసులతో ప్రశ్నించే గొంతులను అణిచివేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడతు న్నదని ఆరోపించారు. ఆందోళనలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వాహనాల్లో అక్కడ నుంచి తరలించారు. కాగా, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధైర్యం చెప్పారు. ఇవాళ ఉదయం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో వాకింగ్ వెళ్లిన నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో పట్నం నరేందర్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేశారు. అక్రమ అరెస్టుపై ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక నియంత విధానాలపై పార్టీ న్యాయపరంగా పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు. నరేందర్ రెడ్డి సతీమణి శృతికి కూడా కేటీఆర్ కాల్ చేసి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ మొత్తం అండంగా ఉంటుందని తెలిపారు. నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ కోర్టులో న్యాయపోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో రేవంత్ రెడ్డి కంగుతిన్నారని అన్నారు. ఆ డ్యామేజీ కంట్రోల్ కోసమే లగచర్లలో జరిగిన ఘటనను బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించే కుట్రలో భాగంగానే తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ప్రజల గొంతుకై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. సమస్యలకు పరిష్కారం ఆలోచించకుండా ప్రతిపక్ష నాయకులను వేధించడం ప్రభుత్వ పనిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం బాధ్యత మరిచినప్పుడు ప్రతిపక్షం ప్రశ్నిస్తూనే ఉంటుందని.. అది తప్పా అని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో సోమవారం అధికారులపై దాడి ఘటనపై ఆ అర్ధరాత్రి నుంచే పోలీస్ యాక్షన్ షురూ అయింది. అర్ధరాత్రి వేళ.. కరెంట్ సరఫరా నిలిపేసి.. ఇంటర్నెట్ సేవలు బంద్ చేసి.. ఇండ్ల తలుపులు బద్దలు కొడుతూ.. ఇల్లిల్లూ సోదాలు చేసి.. సుమారు 300 మంది పోలీసులు 55 మందిని పట్టుకొని బంధించారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం 16 మంది రైతులకు కోర్టుకు రిమాండ్ చేశారు. వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, పరిగి సబ్ జై లుకు తరలించారు. అలాగే బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ వద్దకు వాకింగ్‌కు వచ్చిన పట్నం నరేందర్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. కాగా, నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్ఎస్ భగ్గుమంది. కొడంగల్ నియోజకవర్గవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చింది.

కామారెడ్డిలో...కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని అజమాబాద్ గ్రామంలో అదనపు కలెక్టర్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. సన్న వడ్ల కొనుగోలులో సొసైటీ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విక్టర్ ఎదుట రైతులు తమ సమస్యలను ప్రస్తావించారు. సొసైటీ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైస్ మిల్లర్లు ధాన్యం కటింగ్ తీస్తుండడంతో తమకు ఆర్థిక నష్టం కలుగుతోందని, సొసైటీ అధికారులు సన్న వడ్ల కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. తక్షణమే సొసైటీ విధానంలో మార్పులు చేసి ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టడానికికే ఢిల్లీకి వెళ్లా

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మీద ఈడీ కేసు కాకుండా చూసుకున్నాడా..? లేదా..? చెప్పండి. నేను మలేషియా వెళ్లకుండానే వెళ్లినట్లు మీడియా వాళ్లు ఎలా రాస్తారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ తుగ్లక్ ప్రభుత్వం నిర్ణయం కారణంగా అధికారులు బలి అవుతున్నారు. ప్రభుత్వం కుట్రలో అధికారులు బలి కావద్దని కోరుతున్నా. కొడంగల్‌లో రైతులతో భూసేకరణ పంచాయితీ వచ్చినప్పుడు పిలిచి మాట్లాడని కుసంస్కార ప్రభుత్వం ఇది. మా ప్రభుత్వంలో కూడా భూ సేకరణ సమస్యలు వస్తే రైతులను మెప్పించి ఒప్పించి, వాళ్ల కడుపులో తల పెట్టి మేము మంచి పరిహారం ఇచ్చాం. మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టును పూర్తి చేశాం. కానీ ఈ ముఖ్యమంత్రికి 9 నెలలుగా కొడంగల్‌లో ఆందోళన చేస్తున్న రైతులను కలిసే సమయం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కలెక్టరే స్వయంగా దాడి జరగలేదని చెబుతున్నాడు. ఐజీ మాత్రం దాడి జరిగిందంటున్నారు. కానీ ఇది ఇంటలిజెన్స్ వైఫల్యం. దాడి జరుగుతున్న సమయంలో సెక్యూరిటీ ఏదీ? ఉద్దేశ పూర్వకంగా గొడవ సృష్టించి రైతులు భూసేకరణకు సహకరించటం లేదని భూములను గుంజుకునే కుట్ర చేస్తున్నారు. ముఖ్యమంత్రికి రియల్ ఎస్టేట్ ఫార్ములా, బ్యాగ్‌ల ఫార్ములా మాత్రమే తెలుసు. ఈయనకు ఈ రేస్ అంటే ఏంటో తెలుసా..? అని ప్రశ్నించారు. 11 నెలలుగా రోజుకో కుంభకోణం పేరుతో టైంపాస్ ప్రచారం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని మీడియా కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మేము తప్పకుండా లగచర్ల రైతులకు అండగా ఉంటాం. ఆ ప్రాంతానికి మా పార్టీ నాయకులం వెళ్తాం.





న్యూఢిల్లీ: బుల్డోజర్ల న్యాయంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎగ్జిక్యూటివ్ అధికారులు న్యాయ పక్రియను తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితులను దోషిగా చిత్రీకరించలేమని, దాని ఆధారంగా వాళ్ల ప్రాపర్టీలను నాశనం చేయడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కేవలం నిందితులో లేక దోషులో అయినంతమాత్రానా, వాళ్ల ఇండ్లను కూల్చడం రాజ్యాంగవ్యతిరేకమే అవుతుందని సుప్రీంకోర్టు చెప్పింది. వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను అక్రమంగా కూల్చుతున్నారని వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు న్యాయవిచారణ చేపట్టింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసుల్లో తీర్పును ఇచ్చింది. నిందితుల ఇండ్లను కూల్చడం రాజ్యాంగ వ్యతిరేకం అని, అలాంటి చర్యలకు పాల్పడిన అధికారులపై పెనాల్టీ వేయాలని కోర్టు సూచించింది. నిందితులు, దోషులకు కొన్ని హక్కులు ఉంటాయని కోర్టు చెప్పింది. ఈ క్రమంలో బుల్డోజర్ల న్యాయంపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. రాత్రికి రాత్రే మహిళలు, చిన్నారులను వీధుల్లో చూడడం సంతోషకరమైన అంశం కాదు అని కోర్టు వెల్లడించింది. ఇండ్లను, అక్రమ ప్రాపర్టీలను ధ్వంసం చేసే పక్రియను వీడియో తీయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రజాభూమిలో అక్రమ నిర్మాణం చేపడితే తమ ఆదేశాలు ఆ కేసుల్లో అమల్లోకి రావు అని కోర్టు తెలిపింది. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత పక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. 'కార్యనిర్వాహక అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఆ అధికారి న్యాయమూర్తిగా మారి, నిందితుల ఆస్తులను కూల్చివేయాలని నిర్ణయం తీసుకోలేరు. ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు.. అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..?అలాగే అక్రమకట్టడాల తొలగింపు కోసం ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలి. అంతేగాకుండా మూడు నెలల్లో మున్సిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపు నిచ్చింది. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగి స్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడాన్ని ఇప్పటికే పలు మార్లు సుప్రీం కోర్టు తప్పుబట్టింది. నిందితుల ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడం సరికాదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది.

## బల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుంది



**లక్నో:** బుల్డోజర్ ఇప్పుడు గ్యారేజ్‌లో ఉంటుందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. ఇకపై పేదల ఇళ్లను కూల్చివేయలేరంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. నవంబర్ 20న ఉప ఎన్నికలు జరుగనున్న కాన్పూర్‌లోని సిసామావు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఏం చెప్పిందో మీకు తెలిసి ఉండాలి. ఈ ప్రభుత్వానికి ప్రతీకగా మారిన బుల్డోజర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు' అని అన్నారు. కాగా, ఇళ్లు కూలగొట్టే వారి నుంచి ఏమి ఆశించాలి? అని అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. 'ఇప్పుడు వారి బుల్డోజర్ గ్యారేజ్‌లో ఉంటుంది. పేదల ఇల్లు ధ్వంసం చేయలేరు' అని అన్నారు. సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్న కవి ప్రదీప్ పంక్తులను కూడా అఖిలేష్ యాదవ్ ప్రస్తావించారు. 'ప్రతి ఒక్కరూ ఇంటి కోసం కలలు కంటారు. ఆ ఇంటి కల నెరవేర్చుకోవాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు' అని అన్నారు. సీఎం యోగి ప్రభుత్వంపై ఇంతకంటే బలమైన విమర్శలు ఉండబోవని మండిపడ్డారు.

## ఆదిలాబాద్ వెలిగిపోతోంది

**ఉద్యోగాల వేటలో సామాన్యుల అసామాన్య ప్రతిభ**

**ఒకేసారి ఆరు ఉద్యోగాలు కొట్టేసిన యువతి నిఖిత**

**ఆదిలాబాద్:** ఇటీవలి కాలంలో ఆదిలాబాద్ జిల్లాల్లో పలువురు సర్కార్ కొలువులు సొంతం చేసుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని చిన్న బుగ్గారం చిన్న ప్లలె నుంచి కూడా పలువురు యువతీ యువకులు ఈ ఏడాది సర్కార్ కొలువులు సొంతం చేసుకున్నారు. గతంలో ఈ గ్రామానికి చెందిన కొందరు జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావటం ఆ పల్లెని ఓ మలుపుతిప్పింది. వారిని ప్రేరణగా తీసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని పట్టుబట్టారు. ప్రస్తుతం ఈ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారి సంఖ్య అక్షరాలా 82 మందికి చేరింది. వీరంతా రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్యం వంటి వివిధ శాఖల్లో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జరిగిన పలు ప్రభుత్వ నియామకాల్లో ఆదిలాబాద్ జిల్లా తండాకు చెందిన ఓ యువతి ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించింది. గురుకుల డీఎల్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. చిన్నబుగ్గారానికి చెందిన నిఖితకు చిన్నప్పటి నుంచి టీచింగ్ అంటే మహా ఇష్టం. ఎప్పటికైనా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలనేది ఆమె లక్ష్యం. దీంతో ప్రయత్నాలు ప్రారంభించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది వ్యవధిలోనే ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. గతేడాది 2023 సెప్టెంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు జరిగిన పలు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమై.. పరీక్షలు రాసింద. రోజుకి 7 నుంచి 10 గంటల వరకు ష్టపడి చదివి అనుకున్నది సాధించింది. మొదట సోషల్ వెల్ఫేర్‌లో పీజీటీగా, ఆ తర్వాత టీజీటీ అనంతరం.. జేఎల్, డీఎల్, గ్రూప్ 4 పోస్టులకు వరుసగా ఎంపికైంది. తాజాగా టీఎస్పీఎస్సీ నిర్వహించిన జేఎల్ పరీక్షలోనూ సత్తా చాటింది. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే పేదరికం అడ్డు కాదని నిఖిత నిరూపించింది. ÷ళిఘాలయ రాష్ట్రంలో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేసే ఇందల్‌కుమార్, హైదరాబాద్‌లోని నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేసే భూగర్భ నిపుణులు డాక్టర్ లోహిత్‌కుమార్, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జైసింగ్ కూడా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే. ఏడాది కిందట ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లలో పరీక్ష రాసి ఇటీవల 6 ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన నిఖిత ఈ గ్రామానికి చెందిన యువతే. ఇక్కడ ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నవారు, పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు.

## సీఎం రేవంత్‌ది తుగ్లక్ పాలన

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ విధానాల వల్ల రాష్ట్రంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి.. సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం పడుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తన ఏడు ఎకరాల భూమి పోతుందనే కలెక్టర్‌ను సురేష్ అడిగాడని.. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే అని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ .. వాడో పిచ్చోడు.. ఫార్ములా వన్ ఈ రేసు గురించి ఆయనకేం తెలుసు. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జిలను కూడా తప్పుదోవ పట్టిస్తుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పాలన. రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతోంది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతులు అక్రమ అరెస్టులు జరుగుతుంటే సీఎం ఎక్కడ. షోలాపూర్ చౌరాస్తాలో నిలబడినా.. రేవంత్‌ను ఎవరూ గుర్తుపట్టరు" అంటూ వ్యాఖ్యలు చేశారు. కనీసం సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర పెద్దలను తాను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్‌ను కలవటం కూడా తప్పే అని అన్నారు. కొడంగల్ రైతులు ఆరేడు నెలలుగా రగులుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదని మండిపడ్డారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని చెప్పి.. మళ్ళీ యూటర్న్ ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఫార్మా సిటీ నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి చెప్పారు. అయితే సీఎం సొంత అల్లుడు సత్యనారాయణ రెడ్డి మాక్స్ బీఎన్ ఫార్మా కంపెనీ విస్తరణ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్ళని రేవంత్.. మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మాత్రం వెళ్తారన్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## రోడ్డుపై బైఠాయించిన రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**మహబూబ్‌నగర్** : ధాన్యం కొనుగోళ్లలో రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోపన్‌పల్లి గ్రామంలో నేటికీ వడ్లు కొనుగోలు ప్రారంభించలేదంటూ ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎంతో కష్టపడి పంటలు పండిస్తే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం మొలకెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ట్రాక్టర్‌కి కట్టి ఊరేగించిన అనంతరం దహనం చేశారు.

## ఇందిరమ్మ పాలన కాదు.. రాక్షస పాలన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్**: ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, రాజీవ్ పరిపాలన అని చెబుతూనే రాక్షస పాలన సాగిస్తుందని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మసిటీ పేరిట చిచ్చుపెట్టారు. న్యాయం కోసం ప్రజలు ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. నడి రాత్రి రైతులను అరెస్టు చేయడమే మీ రైతు రాజ్యమా..? అని ప్రశ్నించారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలపై ఎన్ని ఆంక్షలు పెట్టినా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదన్నారు. జనం మిమ్మల్ని ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని, అక్రమంగా అరెస్టు చేసిన పట్నం నరేందర్ రెడ్డి, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కేసుల పరిష్కారంకు సమన్వయంతో పనిచేయాలి.

## - జిల్లా జడ్జి సునీత కుంచాల.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 13**

కేసుల పరిష్కారంకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా మరింత సమన్వయంతో పనిచేయాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. బుధవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని జడ్జి సందర్శించి మాట్లాడారు.




బార్, బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయసేవలు అందించడం జరుగుతుందని అన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత శ్రమిస్తే కక్షిదారులకు న్యాయఫలాలు మరిన్ని అందించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కోర్టుల ద్వారా సత్వర న్యాయాన్ని ఆశిస్తున్న న్యాయార్ధుల ఆశలకు అనుగుణంగా కష్టిద్దామని అన్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత ఎంతో అవసరమని, దానిని కాలానికి, సమయానికి అనుగుణంగా మార్చుకుని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకుందామని అన్నారు. ప్రజలకు అన్ని రాజ్యాంగ వ్యవస్థలకంటే న్యాయవ్యవస్థ పైనే ఎక్కువగా ఆధారపడుతారని, ఆ నమ్మకాన్ని కలిగించాలని అన్నారు. భారత సుప్రీంకోర్టు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు దిగువ కోర్టులపై చాలా ఆశలు పెట్టుకున్నాయని, ఇక్కడ నే కోర్టు కేసులు పరిష్కారం అయితే ఎంతోమేలు కక్షిదారులకు చేసినవారం కాగలమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సహకారంతో గత మూడు సంవ్సరాలుగా జిల్లా ప్రజలకు న్యాయ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ, న్యాయవాద సమాజం ఎల్లప్పుడు ప్రజలకు మెరుగైన, త్వరితగతిన న్యాయసేవలు అందించడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లా ప్రజలకు జిల్లా న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుతామని, కోర్టులలో న్యాయమూర్తుల కొరత, సిబ్బంది కొరత ఉన్న చాలా కోర్టు కేసులు అనుకున్న దానికంటే ఎక్కువగానే పరిష్కారం అవుతున్నాయని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి లు ఖుష్బూ ఉపాధ్యాయ్, హరికృష్ణ, హరి కుమార్, చైతన్య, బార్ ఉపాధ్యక్షుడు పెండెమ్ రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొంన్పాల్ సురేష్, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 13:**

రైతులకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తామనడం విడ్డూరంగా ఉందని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఇందల్వాయి లోని గన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రైతులు చేయనున్న ధర్నాకు బీజేపీ తరపున పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు కొన్ని రోజులుగా అలాగే ఉన్నాయని, ఇప్పటికీ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రైతుబంధు లేదని, రుణమాఫీ పూర్తిగా చేయలేదని, సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇప్పటకీ ఇవ్వలేదని మండిపడ్డారు. తులం బంగారం విషయం కాంగ్రెస్ మరిచి పోయిందన్నారు. ప్రజల్లో రోజురోజుకూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ద్వేషం పెరుగు తుందని అన్నారు. ప్రజలు, రైతాంగంకు బీజేపీ అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. ఎంపీ వెంట నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ తదితరులు ఉన్నారు.ఉంటుందని స్పష్టం చేశారు.

# సామాజిక చైతన్య దివిటి "కాళోజీ".

## - సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 13:**

సామాజిక గొడవలే తన గొడవలుగా, బ్రతుకంతా పోరాటాలతోనే భావించి నిజాం నిరంకుశత్వ దమన నీతికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా తన కలం ఎత్తి, రజాకార్ల అరాచకాలను తనదైన భాషా నైపుణ్యంతో ప్రజలను మమేకం చేసి ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమానికి ఊపిరైనా, సామాజిక చైతన్య దివిటి కాళోజీ నారాయణ రావు అని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు 22వ వర్ధంతిని బుధవారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య కాళోజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిదని, అన్యాయాన్ని ఎదురించిన వాడే ఆరాధ్యుడని, ప్రజా ఉద్యమమే ఊపిరిగా, సామాజిక చైతన్య గొడవలే తన గొడవలుగా జీవించిన మహనీయుడు కాళోజీ అని తెలిపారు. 'ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్లకు కదలిక' అనే కాళోజి మాట అక్షర సత్యమని, తెలంగాణ భాషను, యాసలోని మాధుర్యాన్ని తన రచనలతో ఎలుగెత్తి చాటుతూ, రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజి దిట్టయని నేటి తరం విద్యార్థులు కాళోజీ స్ఫూర్తితో సాహిత్యం పై మక్కువ పెంచు కోవాలని, సామాజిక అభివృద్ధి అంశాలలో తనదైన ముద్ర ఉండేలా నడుచుకొని మహనీయులు కలలు కన్న సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏబీవీపీ నాయకుడిని ఎంపీ అర్వింద్ పరమార్శ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 13**

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ధర్నా చేసిన ఏబీవీపీ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.



దాడిలో గాయపడి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ నాయకుడు సాయిప్రసాద్ ను ఎంపీ బుధవారం పరామర్శించారు. సాయిప్రసాద్ కు అందుతున్న వైద్యం గురించి వైద్యులతో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఎంపీ వెంట అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రేంజర్ల నరేశ్ తదితరులున్నారు.

# వాసవీ శ్రీ నిలయంలో కాళోజీ వర్ధంతి.

## - నివాళులు అర్పించిన మాభూమి సభ్యులు.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, నవంబర్ 13:**

'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన కాళోజీ నారాయణరావు వర్ధంతిని బుధవారం ఎల్ బి నగర్ లోని వాసవీ శ్రీ నిలయంలో మాభూమి సాహితీ సాస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదిగా జీవితాంతం ప్రజలకోసం జీవించి మరణానంతరం కూడా ప్రజల ఉపయోగార్థమే తన దేహాన్ని వైద్య కళాశాలకు అంకితం ఇవ్వడాన్ని మన మంతా ఆదర్శంగా తీసుకుని అవయవ దానం గాని, శరీర దానం కానీ చేయాలనీ వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాభూమి కార్యవర్గ సభ్యులు నరసింహ ప్రసాద్, ఉదయ్ శంకర్, యానాల నాగిరెడ్డి, రఘునందన్, శరణ్య, పద్మలత, విజయకుమార్, పవన్ కుమార్ రెడ్డి, శంకర్, అలివేలు మంగ, ఉమాదేవి, యాదగిరి, శంకర్, ఘంటా సుబ్రహ్మణ్యం, చంద్రకళ పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎఇ కి రెండేళ్ల జైలు శిక్ష.

## - ఏసీబీ కోర్టు సంచలన తీర్పు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 13: మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ గా పని చేసిన పోరెడ్డి అశోక్ కు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు. నగరంలోని బొబ్బిలివీధికి చెందిన బండారి అరవింద్ అనే కాంట్రాక్టర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ అయిన అశోక్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ 2012 మే 29న ఏసీబీకి చిక్కారు. ఈ కేసులో నాంపల్లిలోని ఏసీబీ న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.40 వేలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మొత్తం జరిమానా రూ.40 వేలు చెల్లించని యెడల ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్టు తెలిపారు.

# కాషాయ దళపతి రేసులో నలుగురు

హైదరాబాద్, :రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఆ నలుగురు నేతల లాబీయింగ్..సంస్థాగత ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. బూత్ స్థాయి నుంచి మొదలుకుని రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడి వరకు ఎన్నికల ప్రక్రియ ద్వారా నియామకం జరగనుంది. డిసెంబర్ నెలాఖరున రాష్ట్ర అధ్యక్ష పదవికి, జనవరిలో జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగే అవకాశముంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో కనిపిస్తోంది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే నలుగురు నేతలు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎవరు అవుతారనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ గా పనిచేసి.. ఇప్పుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతోన్న బండి సంజయ్ కు మరోసారి పార్టీ అధ్యక్ష పగ్గాలు దక్కుతాయనే టాక్ వినిపిస్తోంది. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాక పార్టీలో జోష్ వచ్చిందంటున్నారు ఆ పార్టీ నేతలు. ఆయన ఆధ్వర్యంలోనే దుబ్బాక, హుజురాబాద్ బైపోల్ లో విజయంతో పాటు గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటామంటున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మీద గట్టిగా పోరాడిన నేతగా సంజయ్ కు క్యాడర్లో గుర్తింపు ఉంది. ఇప్పుడు మళ్లీ గ్రేటర్ ఎన్నికలు వస్తుండటంతో పాటు పార్టీ అధికారంలోకి వచ్చేంత పటిష్టం కావాలంటే సంజయ్ ను అధ్యక్షుడిని చేస్తేనే బాగుంటుందన్న అభిప్రాయాలున్నాయి.అసెంబ్లీ ఎన్నికలకు ముందు సడెన్ గా ఆయనను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడంతో బీజేపీ క్యాడర్ నిరుత్సాహానికి గురైంది. కట్టర్ బీజేపీ నేతగా.. మాస్ లీడర్ గా సంజయ్ కు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. అందుకే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను తప్పించడం వల్ల జరిగిన డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకోవాలంటే తిరిగి మళ్లీ సంజయ్ నే ప్రెసిడెంట్ చేయాలన్న వాదన వినిపిస్తోంది.ఇక మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బండి సంజయ్ ని అధ్యక్షుడిగా తప్పించి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చే సమయంలోనే ఈటల ప్రెసిడెంట్ అవుతారని చర్చ జరిగింది. కానీ ఆయనకు బాధ్యతలు ఇవ్వలేదు. అయితే ఈటల రాజేందర్ ని పార్టీ ప్రెసిడెంట్ చేస్తే బీసీకి అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని పార్టీ భావిస్తున్నట్లు టాక్.ఇక మరో నేత.. మెదక్ ఎంపీ రఘునందన్ రావు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నారు. ఆయన బీజేపీలో పుట్టి పెరిగిన నేత కాకపోయినా..ఆ పార్టీలో చేరగానే.. సిద్ధాంతాలను అడాప్ట్ చేసుకుని..ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చిన నేతలా పార్టీ కోసం గళం వినిపిస్తుంటారు. అంతేకాదు ప్రశ్నించే గొంతుగా రఘునందన్ కు ప్రజల్లో గుర్తింపు ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దుబ్బాకలో ఓడినా పట్టుబట్టి మెదక్ ఎంపీ టికెట్ తెచ్చుకుని గెలిచి సత్తా చాటారు రఘునందన్. ఇప్పుడు అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే.. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని ఆయన చెప్తున్నట్లు తెలుస్తోంది.బీజేపీ సీనియర్ లీడర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కూడా పార్టీ అధ్యక్ష రేసులో ఉన్నారు. ఆయన పార్టీలో మొదటినుండి ఉన్న సీనియర్ నేత. గ్రేటర్ బీజేపీ ప్రెసిడెంట్ గానూ పనిచేసిన అనుభవం ఉంది. ఒకవేళ ఆయనకు పార్టీ ప్రెసిడెంట్ పగ్గాలు అప్పగిస్తే..ఎలా ఉంటుందని కూడా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా కాషాయ దళపతి రేసులో ఉన్నట్లు టాక్ నడుస్తోంది.

# ఇక కారు... సారు..ఎంటరు....

హైదరాబాద్:పదేండ్ల పాలన తర్వాత ప్రజా తీర్పుతో ఖంగుతిన్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. సీఎం కుర్చీలో నుంచి దిగిపోయాక.. పెద్దగా జనంలోకి రాకుండా ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు. తుంటి ఎముక శస్త్ర చికిత్స తరువాత ఆయన ఫాం హౌస్ లో పూర్తి స్థాయి విశ్రాంతి తీసుకున్నారు. కృష్ణ జలాల వాటా పై ఆయన స్టిక్ సహాయంతో నల్లగొండ బహిరంగ సభకు హాజరు అయ్యారు. తరువాత ఎండిన పంట పొలాలు పరిశీలించేందుకు రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర చేపట్టారు. తరువాత కూడా ఫాం హౌస్ కే పరిమితయ్యారు. అక్కడే కార్యకర్తలను కలుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యక్ష రాజకీయాలకు కేసీఆర్ ఇక బై బై చెప్పనున్నారని జోరుగా చర్చ నడుస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు ఒక్కసారి అలా వచ్చి..ఇలా వెళ్లిన కేసీఆర్.. మళ్లీ హాజరయ్యేందుకు ఆసక్తి చూపకపోవడం ఈ వాదనలు మరింత బలపరిచాయి.ప్రతిపక్ష పాత్ర 100 శాతం నెరవేరుస్తామని చెప్పిన కేసీఆర్ ఆ దిశగా అడుగులు మాత్రం వెయ్యక పోవడం విమర్శలకు మరింత బలాన్ని ఇచ్చాయి. ఆరోగ్య రీత్యా కొన్ని రోజులు ఫాం హౌస్ లో రెస్ట్ తీసుకుంటున్నారని.. పార్టీ శ్రేణులు భావించారట. తుంటి ఎముక శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తరువాత కూడా ఆయన మాత్రం ఫాం హౌస్ ను నుంచి బయటకు రాకపోవడంతో సొంత నేతలు కూడా ఇన్నాళ్లు మీమాంసలో ఉన్నారట. పాలిటిక్స్‌కి దూరంగా ఉంటూ వస్తున్న కేసీఆర్ కొన్ని నెలల తర్వాత మళ్లీ వార్తల్లోకి వచ్చారు. శనివారం ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లో పాలకుర్తి నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమై.. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన.. ఆ తర్వాత కారు నడుపుతూ గులాబీ కార్యకర్తల్లో జోష్ కనిపించారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్ రెడ్డిని పక్కన కూర్చోబెట్టుకొని మరీ.. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయ్. ఇదంతా చూస్తుంటే.. కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కేసీఆర్.. ఇప్పుడు నెమ్మదిగా కార్యకర్తలతో మీటింగులు, కారు డ్రైవింగ్‌లు చూస్తుంటే.. మళ్లీ జనంలోకి రాబోతున్నాననే సంకేతాలు ఇస్తున్నట్లు.. యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. కార్యకర్తలతో భేటీ తర్వాత వారిలో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు కేసీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వంద శాతం మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఇలాంటి డైలాగులతో.. పార్టీ నుంచి క్యాడర్ జారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అయితే అనూహ్యంగా కేసీఆర్ ఇప్పుడు మళ్లీ యాక్టివ్ అవ్వడం వెనుక రీజన్ ఏంటని సర్వత్రా చర్చనీయాంశంగా మారిందట. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలన్నీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే చూస్తున్నారు. కేటీఆర్ వ్యవహార శైలి సీనియర్ నాయకుల్లో అసంతృప్తి కలిగిస్తుందట. వర్కింగ్ ప్రెసిడెంట్ గా పార్టీలో అన్ని తానై వ్యవహరిస్తున్న కేటీఆర్ కొందరిని మాత్రమే కలుపేసుకుంటూ పోతున్నారనే విమర్శను ఎదుర్కొంటున్నారట. ఈ తరహా శైలితో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని పార్టీలో సీనియర్ లీడర్లు వాపోతున్నారట. ముఖ్యంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వైఖరితో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని చర్చించుకుంటున్నారట. వారిని కేటీఆర్ ప్రోత్సహిస్తున్నారని కారు పార్టీ నేతల్లో జోరుగా గుసగుసలు నడుస్తున్నాయట.కొన్నాళ్లుగా.. డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్.. రీసెంట్ ఇష్యూ లతో తండ్రి కేసీఆర్‌కు తలనొప్పిగా మారారట. జన్వాడ ఫామ్ హౌజ్‌లో కేటీఆర్ బావమరిది పాకాల రాజు పార్టీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ అవ్వడం.. కేటీఆర్‌పై వస్తున్న డ్రగ్స్ ఆరోపణలకు.. మరింత బలం చేకూరుస్తోందని అనుకుంటున్నారట. ఇప్పటికే.. బీఆర్ఎస్ హయాంలో డ్రగ్స్ కేసును తొక్కిపెట్టారనే విమర్శలున్నాయట.

# ప్లీజ్ నన్ను అలా పిలవకండి : కమల్



భారతీయ సినిమా చరిత్ర ఉన్నంత కాలం గర్వించదగ్గ కళాకారుడు 'కమల్ హాసన్'. సినిమా అనేది సాహిత్యం అయితే ఆయనను చరిత్ర స్టార్‌గానో, హీరోగానో కాదు గొప్ప కళాకారుడిగా గుర్తించుకుంటుంది. కేవలం వర్సటైల్ యాక్టింగ్‌తోనే కాకుండా సినీ రంగంలో అనేక ప్రయోగాలతో రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన స్థానం ఎవరెస్ట్. ఇటీవల 'కమల్ హాసన్' 70 ఏళ్ళలోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో ఆయన తన జీవితంలో ఒక ఆసక్తికర నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాన్ని పాటించాలని తన అభిమానులని, ఆరాధకులని, మీడియాని అందరిని ఉద్దేశించి ఒక బహిరంగ విన్నపం చేశారు. ఆ విన్నపం ఏంటంటే.. కమల్ అభిమానులు ఆయనని ప్రేమగా "ఉలగనాయగన్" అని పిలుస్తారు. దాని అర్థం యూనివర్సల్ స్టార్. తెలుగులోనూ 'విశ్వనాయకుడు', 'లోకనాయకుడు' టైటిల్స్‌తో ఆయనని సంబోధిస్తారు. అయితే అలా పిలవడం కమల్‌కి ఇష్టం లేదని తెలిపారు.

## యూట్యూబ్ ఛానళ్లపై అల్లు అర్జున్ ఫ్యాన్స్ దాడి



అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా రిలీజ్ దగ్గరపడుతున్న వేళలో సోషల్ మీడీయాలో హీట్ పెరిగిపోతుంది. ఒకవైపు మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీ అంటూ ఫ్యాన్స్ కొట్టుకుంటున్నారు. అయితే ఈ విషయంపై అల్లు అర్జున్ త్వరలోనే 'అన్‌స్టాపబుల్ సీజన్ 4' వేదికగా బాలయ్యతో క్లారిటీ ఇవ్వనున్నారు అని తెలుస్తోంది. ఇదిలా ఉండగా బన్నీ ఫ్యాన్స్ ఒక ప్రముఖ యూట్యూబ్ ఛానల్‌పై దాడి చేశారు. ఎందుకంటే.. సోమవారం హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఆఫీస్‌పై అల్లు అర్జున్ ఫ్యాన్స్ దాడి చేశారు. ఈ దాడిలో ఫర్నిచర్‌తో పాటు కంప్యూటర్లు ఇతర సామాగ్రి ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ పై ఉద్దేశపూర్వకంగా నీచమైన థంబ్స్‌తో వీడియోలు పెడుతున్నారని అందుకే ఈ దాడి చేశామని ఫ్యాన్స్ ప్రకటించారు. ఒక వీడియోలో ఏకంగా చావు, బ్రతుకుల మధ్య కొట్టాడుతున్న అల్లు అర్జున్ అని థంబ్ పెట్టడంపై సీరియస్ అయ్యారు. అయితే వ్యక్తులపై ఎలాంటి భౌతిక దాడులు ఈ ఘటనలో చోటుచేసుకోలేదు.



## ఆలియాభట్‌తో నాగ్ అశ్విన్ బిగ్ ప్రాజెక్టు

యువ దర్శకుడు నాగ్ అశ్విన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. దిగ్గజ దర్శకుడు శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి తొలి సినిమా ఎవడే సుబ్రమణ్యం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు. నాని హీరోగా వచ్చిన ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రం అనంతరం కీర్తి సురేష్‌తో ఏకంగా మహానటి అంటూ సూపర్ హిట్ అందుకున్నాడు నాగ్. తర్వాత ప్రభాస్‌తో ఏకంగా కల్కి సినిమా తీసి బ్లాక్ బస్టర్ సాధించడమే కాకుండా రూ.1200 కోట్ల వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. ప్రభాస్ ప్రస్తుతం బిజీగా ఉండడం. కల్కి 2 పనులు ఇంకా కంప్లీట్ అవ్వకపోవడంతో వేరే ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే పనిలో పడ్డాడు నాగ్ అశ్విన్. నాగ్ ప్రస్తుతం ఒక లేడి ఓరియెంటెడ్ పాన్ ఇండియా స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఫిమేల్ లీడ్ రోల్‌లో బాలీవుడ్ నుంచి అలియా భట్‌ని నాగ్ తీసుకుబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అలియా భట్ ఫిమేల్ లీడ్ రోల్‌లో చేసిన హైవే, గంగుబాయి కతియావాడి, డియర్ జిందగి, జిగ్రా, రాజీ చిత్రాలు హిట్ అవ్వడంతో అలియానే ఈ పాత్రకు సెట్ అవ్వుతుందని నాగ్ అశ్విన్ భావిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్‌తో పాటు బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ నిర్మించబోతున్నట్లు టాక్.



## ఆ రెండు సినిమా మధ్య పోటీ

రామ్ చరణ్ గేమ్ ంజర్ టీజర్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గేమ్ చేంజర్ టీజర్‌ను ఫ్యాన్స్, యాంటీ ఫ్యాన్స్ అందరూ కూడా పోస్ట్ మార్టం చేసేసి.. చిన్న చిన్న డీటైలింగ్స్‌ను పట్టుకుని స్టోరీలను అల్లేస్తున్నారు. ఇక ట్రోలింగ్ బ్యాచ్ అయితే రెడీగానే ఉంటుందన్న సంగతి తెలిసిందే. చాలా రోజులకు ఓ కలర్ ఫుల్, గ్రాండియర్ సినిమాను చూడబోతోన్నట్టుగా అనిపిస్తోందని శంకర్ ఫ్యాన్స్ అయితే సంబరంగానే ఉన్నారు. ఇది ప్యూర్ శంకర్ మార్క్ చూపించే సినిమాగా రాబోతోందని టీజర్ చూస్తే తెలుస్తోంది. రామ్ చరణ్ గేమ్ చేంజర్ టీజర్ థీమ్‌ను సాయంత్రం (04:05) విడుదల చేస్తారట. అదే టైంకి పుష్ప 2 నుంచి అదిరిపోయే, అందరూ ఎదురుచూసే అప్డేట్ ఇస్తామని మైత్రీ ప్రకటించింది. ఇలా ఒకే టైంకి అటు గేమ్ చేంజర్, ఇటు పుష్ప 2 అప్డేట్లు రాబోతోన్నాయి. మరి ఈ అప్డేట్లతో సోషల్ మీడియా మొత్తం ఈ రెండు హ్యాష్ ట్యాగ్‌లే కనిపిస్తుంటాయి. అసలే ఇప్పటికే గేమ్ చేంజర్ టీజర్ రికార్డులు అంటూ మెగా ఫ్యాన్స్..

దేవర టీజర్, పుష్ప టీజర్‌ల రికార్డులను తెరపైకి తీసుకు వస్తున్నారు.సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌లు ఎక్కువ అవుతున్న సంగతి తెలిసిందే. బన్నీ వర్సెస్ మెగా ఫ్యాన్స్ అన్నట్టుగా ఈ తరుణంలోనే మట్కా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ మాటలతో అగ్గి రాజేశాడు. ఎక్కడి నుంచి వచ్చామో..

ఎలా వచ్చామో అన్నది మర్చిపోతే.. అసలు సాధించిన సక్సెస్ వృథా అని అన్నాడు. ఈ మాటలు బన్నీకి కౌంటర్ అని మెగా ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. దీంతో మరోసారి అల్లు వర్సెస్ మెగా అన్నట్టుగా నెట్టింట్లో వార్ మొదలైంది. ఇలా ఫ్యాన్ వార్ ఉన్న టైంలోనే మైత్రీ నుంచి పుష్ప ట్రైలర్ అప్డేట్, గేమ్ చేంజర్ నుంచి టీజర్ థీమ్ రాబోతోంది. ఈ రెండు సినిమాల ఫలితాల తరువాత ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి. అసలే ఈ రెండు పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేసి బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే.

## డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై కేసు

ప్రముఖ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. 'వ్యూహం' సినిమా సమయంలో చంద్రబాబు, లోకేశ్, బ్రాహ్మణిని కించపరిచేలా పోస్టు పెట్టారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఫిర్యాదు చేశారు. దీంతో మద్దిపాడులో ఐటీ చట్టం కింద రాంగోపాల్ వర్మపై కేసు నమోదు చేశారు. కాగా చంద్రబాబు, పవన్, లోకేశ్ పై అనుచిత పోస్టులు పెట్టిన పలువురు వైసీపీ కార్యకర్తలను ఇప్పటికే అరెస్టులు చేస్తున్న విషయం అందరికి తెలిసిందే.



## నిజజీవితంలో తల్లి కావాలని ఉంది

దాదాపు ఏడాది గ్యాప్ తర్వాత సమంత తెరపై కనిపించింది. అది వెండి తెర మీదు కాదు బుల్లితెరపై. 'సిటడెల్: హనీ బన్నీ' సిరీస్‌తో ఇటీవల ప్రేక్షకులను పలకరించింది సామ్. ఎంతోకాలంగా వెయిట్ చేస్తున్న ఈ సిరీస్ ఈ నెల ఏడో తేది నుంచి అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. సిరీస్ సాధించిన సక్సెస్ పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఇదే వేదికపై ఆమె పలు అంశాల గురించి మాట్లాడారు. ఇక నాగ చైతన్యతో డైవర్స్ అయినా తర్వాత తన మాతృత్వం గురించి = మాట్లాడారు సమంత. ఇంతకీ ఆమె ఏమన్నారంటే.. ఇటీవల సమంత నటించిన 'సిటడెల్: హనీ బన్నీ' సిరీస్ ప్రేక్షకులని ఆకట్టుకుంది. ఈ సిరీస్ లో ఆమె కశ్వీ మజ్ముందర్ తల్లిగా యాక్ట్ చేసింది. ఆ అమ్మాయి తెలివైందని, అద్భుతంగా హావభావాలు పలికించిందని కొనియాడారు సామ్. అయితే తనకు నిజజీవితంలో తల్లి కావాలనే కలలు ఉన్నాయి అని సామ్ తెలిపింది. ఆమె అమ్మగా ఉండటానికి ఇష్టపడతానని చెప్పారు. కానీ.. దీనికి ఆలస్యమైందని నేను అనుకోవట్లేదని ఆమె తెలిపారు. ప్రస్తుతం తాను జీవితంలో చాలా సంతోషంగా ఉన్నానని ఆమె పేర్కొంది. ఇక 'సిటడెల్: హనీ బన్నీ' కథ విషయానికొస్తే.. హనీ (సమంత)) నైనిటాల్‌లోని ఓ కాఫీ షాప్‌లో వర్క్ చేస్తుంటుంది. ఆమెకు నదియా అనే ఐదేళ్ల కూతురు ఉంటుంది. కెఫే కోసం సరకులు తీసుకురావడానికి మార్కెట్‌కు వెళ్లిన హనీని ఓ వ్యక్తి ఫాలో అవుతుంటాడు. అది గమనించి అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో హనీ దొరికిపోతుంది. ఏదోలా అక్కడి నుంచి తప్పించుకునితన కుమార్తెను తీసుకుని వేరే ఊరికి వెళ్లిపోతుంది. హనీ ఉన్న ప్రదేశం తెలుసుకుని కొందరు వ్యక్తులు అక్కడికి కూడా వస్తారు. మరోవైపు చనిపోయిందనుకున్న తన భార్య హనీ బతికే ఉందన్న విషయం విదేశాల్లో ఉన్న బన్నీ (వరుణ్ ధావన్)కి తెలుస్తుంది. దాంతో ఆమెను వెతుక్కుంటూ ఇండియాకు పయనమవుతాడు. అసలు హనీ వెంట పడుతున్న ఆ వ్యక్తులు ఎవరు? ఆమె గతం ఏంటి? భార్యను వెతుక్కుంటూ వచ్చిన బన్నీకి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? చివరకు హనీని, తన బిడ్డ నదియాను బన్నీ కలిశాడా? ప్రైవేటు సీక్రెట్ ఏజెన్సీ నాయకుడు గురు (కేకే మేనన్) ఒకవైపు, 'సిటడెల్' టీమ్ మరోవైపు వెతుకుతున్న అర్మార్డ్ అనే వస్తువు ఏంటి? చివరకు అది ఎవరి వశమైంది అన్నది ఇతివృత్తం.



## సినీ కార్మికులకు శుభవార్త

ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ

టాలీవుడ్ సినీ కార్మికులకు సంబంధించి తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి శుభవార్త చెప్పారు. అర్హులైన సినీ పరిశ్రమ కార్మికులకు హైదరాబాద్ చిత్రపురి కాలనీలో ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అదేవిధంగా చిన్న సినిమాలు తీసే వారికి థియేటర్లు ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. సోమవారం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు సినిమాలు అంటే చాలా ఇష్టమని అన్నారు. మన రాష్ట్రంలో చాలా ప్రతిభావంతులైన ఆర్టిస్టులు, డైరెక్టర్లు, నిర్మాతలు ఉన్నారన్నారు. వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. పాన్ ఇండియా సినిమాలు తీసే సత్తా తెలంగాణ వారికీ ఉందన్నారు. లోకల్ టాలెంట్‌ను అందరూ సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక చిత్రపురి కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన తర్వాతనే తనకు సన్మానం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



## విజయ్ 'సాహిబా' ఆల్బమ్ ప్రోమో విడుదల

రౌడీ హీరో విజయ్ దేవరకొండ బాలీవుడ్‌లో ప్రైవేట్ ఆల్బమ్ చేస్తున్న విషయం తెలిసిందే. హీరియే పాటతో క్రేజ్ తెచ్చుకున్న బాలీవుడ్ సెన్సేషనల్ సింగర్ జాస్లీన్ రాయల్ విజయ్‌తో ఈ ఆల్బమ్ చేస్తుంది. 'సాహిబా' అంటూ ఈ ఆల్బమ్ రానుండగా.. ఇందులో విజయ్ సరసన రాధిక మోహన్ నటిస్తుంది. ఇప్పటికే రాధికా–జస్లీన్ రాయల్ కాంబినేషన్‌లో వచ్చిన 'నై జానా' సాంగ్ సూపర్ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ సాంగ్ ఎలా ఉండబోతుందని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.

